

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం సా : 6.35 గం.
సహర్ : బుధవారం ఉ : 4.46 గం.

నిప్పుల కుంపటి

- మండుతున్న ఉమ్మడి జిల్లా
- 43 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- మరో రెండు డిగ్రీలు పెరిగే అవకాశం
- మూడు జిల్లాలకూ ఆరెంజ్ అలర్ట్
- ఉక్కిరిబిక్కిరవుతున్న జనం
- బయటకు వెళ్లే జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

చిట్యాల	43
నిజాంపేట	42.1
కౌడిపల్లి	42



మెదక్ అర్బన్, ఏప్రిల్ 2: ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. రెండ్రోజులుగా జిల్లావ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రత సగటున 41 డిగ్రీలు దాటింది. అత్యధికంగా సిద్దిపేట జిల్లా చిట్యాలలో మంగళవారం 43 డిగ్రీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో 42.6 డిగ్రీలు, మెదక్ జిల్లా కౌడిపల్లిలో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత మరో రెండు డిగ్రీలు పెరిగే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడం ఆందోళన కలిగిస్తున్నది. ఎండల తీవ్రతకు మధ్యాహ్న సమయంలో ఉమ్మడి జిల్లాలోని ముఖ్య కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. సాయంత్రం 5 దాటినా ఎండ వేడిమి తగ్గడం లేదు.

చిట్యాలలో అత్యధికం

ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అత్యధికంగా సిద్దిపేట జిల్లా చిట్యాలలో 43 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. దూళిమిట్టలో 42.9 డిగ్రీలు, లక్దారంలో 42.1 డిగ్రీలు, సిద్దిపేట అర్బన్‌లో 41.7 డిగ్రీలు, కట్కూర్‌లో 41.6 డిగ్రీలు, సిద్దిపేట రూరల్‌లో 41.2 డిగ్రీలు, మద్దూర్‌లో 41.1 డిగ్రీలు, రాంపూర్‌లో 41.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో 42.6 డిగ్రీలు, సదాశివపేటలో 42.2 డిగ్రీలు, కల్హేర్‌లో 41.9 డిగ్రీలు, పాశమైలారంలో 41.6 డిగ్రీలు, వట్‌పల్లి, కొండాపూర్‌లో 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లా కౌడిపల్లిలో 42 డిగ్రీలు, పొడ్చన్‌పల్లిలో 41.2 డిగ్రీలు, శివ్వంపేటలో 41.1 డిగ్రీలు, కొల్చారంలో 41.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



సిద్ది పేట జిల్లా మిట్టపల్లిలో కుంట వద్ద నీళ్లు తాగుతున్న జీవాలు

ఇంకా పెరిగే అవకాశం

రాబోయే రెండు.. మూడు రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తున్నది. ఉమ్మడి జిల్లాలో ఈ నెల 5 వరకు 44 డిగ్రీలకు చేరుకునే అవకాశముందని హెచ్చరిస్తున్నది. అందుకే ఉమ్మడి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎండవేడికి వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



సిద్దిపేటలో..

ఆరెంజ్ అలర్ట్‌లో పేర్కొన్న ప్రాంతాలు

సిద్దిపేట జిల్లాలోని చిట్యాల, దూళిమిట్ట, లక్దారం, సిద్దిపేట, కట్కూర్, రాఘవపూర్, రేంబర్తి, రాంపూర్, సముద్రాల, కోహెడ, బెజ్జంకి, కొమురవెల్లి, కొండపాక, హుస్నాబాద్, చేర్యాల, తొగిట... సంగారెడ్డి జిల్లాలోని నిజాంపేట, సదాశివపేట, పాశమైలారం, కల్హేర్, వట్‌పల్లి, కొండాపూర్, జిన్నారం, కంది, నారాయణఖేడ్, అమీన్‌పూర్, సిర్గాపూర్, కిష్టారెడ్డిపేట, ఆర్సీపురం, చౌటకూర్, గుమ్మడిదల, కడ్పల్, సుల్తాన్‌పూర్, మెదక్ జిల్లాలోని కౌడిపల్లి, పొడ్చన్‌పల్లి, కొత్తపేట, శివ్వంపేట, కొల్చారం, దామారంచ, రేగోడ్, పాతూర్, అల్లాదుర్గం తదితర గ్రామాలు ఆరెంజ్ అలర్ట్ పరిధిలో ఉన్నాయి.

అత్యవసరమైతేనే బయటకు..

వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అత్యవసరమయితే తప్ప ఎండల్లో బయటకు రావొద్దు. ఎండలో తిరగాల్సివస్తే గొడుగు, టోపీ వినియోగించాలి. వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలి.

-రాహుల్‌రాజ్, మెదక్ కలెక్టర్

ఎండల్లో ఆరోగ్యం జాగ్రత్త 7లో



ఇఫ్తార్..

మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ప్రార్థనలు చేసిన అనంతరం ముస్లింలకు పండ్లు తినిపించి రోజా విరమింపజేశారు. -మునిపల్లి

తాగునీటి సమస్య తలెత్తొద్దు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి
- రెండ్రోజుల్లో యాక్షన్‌ప్లాన్ తయారు చేయండి
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 2: వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన నీటిఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా యాక్షన్ ప్లాన్‌ను రెండ్రోజుల్లో సిద్ధం చేయాలని సూచించారు. బోర్లు, చేతి పంపులు, మంచినీటి పైపులైన్ల మరమ్మతులు, నూతన లైన్ల నిర్మాణం యుద్ధప్రాతిపాదికన చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు గడపగడపకు అందించాలని.. ఎక్కడైనా సరఫరాలో ఇబ్బంది వస్తే తక్షణమే తన దృష్టికి తేవాలని పేర్కొన్నారు. గ్రామంలో నీటి వినియోగం, లభ్యత, నిల్వ సామర్థ్యంపై పంచాయతీ కార్యదర్శులకు సమగ్రమైన అవగాహన ఉండాలని సూచించారు. వేసవి కాలం ముగిసే అప్రమత్తంగా ఉండాలని, నీటి సరఫరాపై నిత్యం రిపోర్టును కలెక్టరేట్‌కు పంపాలని ఆదేశించారు. వేసవిలో తలెత్తే సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. అనంతరం నర్సరీల నిర్వహణ, ఉపాధిహామీ పనులపై ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎంహెచ్‌వో శ్రీరామ్, డీఆర్‌డీవో శ్రీనివాస్ రావు, డీపీవో యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి హాజరైన అధికారులు

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 2 : ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ రోజు విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాలలో ఈవీఎం, వీవీ ప్యాట్లపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ ఏజెంట్లకు పోలింగ్ నియమాలను వివరించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ జరపాలని పేర్కొన్నారు. బ్యాలెట్ గోపత్యను కాపాడే విధంగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. ప్రిసైడింగ్ అధికారి హ్యాండ్‌బుక్‌లోని సూచనలను పాటించాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు ఫారం 12-ఏ, 12 ద్వారా ఎన్నికల విధుల ధ్రువపత్రం, పోస్టల్ బ్యాలెట్ పొంది ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో తలెత్తిన పొరపాట్లను సరిదిద్దుకుని ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు.



సంగారెడ్డిలో ఈవీఎం, వీవీప్యాట్లపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ క్రాంతి

జిన్నారం ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

సమావేశానికి హాజరు కానీ బీఆర్ఎస్ ఎంపీటీసీలు

జిన్నారం, ఏప్రిల్ 2: జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై బీఆర్ఎస్ ఎంపీటీసీలు ప్రతిపాదించిన అవిశ్వాసం వీగిపోయింది. మంగళవారం జిన్నారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవిశ్వాస ప్రత్యేక సమావేశానికి ఆర్డీవో వసంతకుమారి హాజరయ్యారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సమయం ఉండగా, బీఆర్ఎస్ ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగినట్లు ఆర్డీవో ప్రకటించారు. అవిశ్వాసం సందర్భంగా ఎంపీపీ కార్యాలయం వద్ద సీఐ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సంఖ్యాబలం లేక..

ఎంపీపీపై అవిశ్వాసం ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ ఎంపీటీసీలకు కోరంకు సరిపడా సభ్యుల బలం లేకనే సమావేశానికి హాజరు కాలేదని తెలుస్తున్నది. మండలంలో 8 మంది ఎంపీటీసీలు ఉండగా అవిశ్వాసానికి ఐదుగురు అవసరం. ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఓ ఎంపీటీసీ చేరడంతో రెండు పార్టీలకు నలుగురు చొప్పున ఎంపీటీసీలు ఉన్నారు. దీంతో అవిశ్వాసంపై బీఆర్ఎస్‌కు నిరాశే మిగిలింది.



అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ప్రకటిస్తున్న ఆర్డీవో, ఎంపీడీవో, తహసీల్దార్

సంజీవన్‌రావుపేట పీఏసీఎస్ చైర్మన్‌పైనా..

నారాయణఖేడ్, ఏప్రిల్ 2: నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట ప్రాథమిక సహకార సంఘం(సీడెడ్) సొసైటీ చైర్‌పర్సన్ ఊర్మిళపై ప్రవేశ పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. ఇందుకు సంబంధించి జిల్లా సహకార అధికారి ప్రసాద్ తెలిపిన వివరాలు ఈ విధంగాఉన్నాయి. నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన సహకార సంఘం ఎన్నికల్లో సంజీవన్‌రావుపేట సొసైటీకి సంబంధించి బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన 5 మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. అప్పట్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఊర్మిళరాంరెడ్డి చైర్ పర్సన్‌గా, బీమన్నపల్లి రాములు వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్ల మద్దతుతో ఎన్నికయ్యారు. కొన్ని నెలల క్రితం వైస్ చైర్మన్‌రాములుతోపాటు బాలయ్య, దేవీసింగ్ మృతి చెందారు. వారి స్థానంలో ఇటీవల కోఆప్షన్ సభ్యులుగా దినాకర్‌రావు, సుందరమ్మ, సతీష్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం.. ఖేడ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలుపొందడంతో.. ఆ పార్టీకి చెందిన డైరెక్టర్లు.. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు సభ్యుల మద్దతుతో ఇటీవల చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసు ఇచ్చారు. నోటీసుపై సంజీవరెడ్డి, శంకర్‌రావు, మల్లికార్జున్‌రెడ్డి, బుజ్జం కిషన్, సుశీల, సుందరమ్మ, దినకర్‌రావు, సతీష్, రుక్కమ్మలు సంతకాలు చేశారు. దీంతో మంగళవారం సంజీవన్‌రావుపేట పీఏసీఎస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం కోరం కోసం 9 మంది డైరెక్టర్లు హాజరుకావాల్సి ఉండగా.. ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లాసహకార అధికారి ప్రకటించారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ సిద్దారెడ్డి, సహాయ రిజిస్ట్రార్ చిన్నారావు, సీఈవో మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డిల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం 1099.02 కోట్లు

- ప్రభుత్వ ఖజానాకు రూ.156.15 కోట్లు అధికంగా జమ
- ఉమ్మడి జిల్లా పరిధిలో 16 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.942.87 కోట్ల ఆదాయం
- 1,20,301 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
- 2023-24 సంవత్సరానికి 1,28,124 ఆస్తుల నమోదు
- సంగారెడ్డిలో తగ్గుదల.. పటాన్‌చెరులో జోరు



సంగారెడ్డిలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, ఏప్రిల్ 2 : వరుస ఎన్నికలు.. కోడ్ ఉన్నా రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగుతున్నది. ఆ శాఖ ద్వారా రాష్ట్ర ఖజానాకు వచ్చే రాబడి భారీగా పెరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. గత మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన ఆదాయం రూ.156.15 కోట్లు పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1,20,301 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.942.87 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే ఆ వెంటనే 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,28,124 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు 1099.02 కోట్ల రాబడి వచ్చి చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఆదాయం గణనీయంగా తగ్గింది. కొత్తగా ఏర్పడిన పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో మాత్రం భారీగా ఆదాయం సమకూరింది.

కొత్తగా ఏర్పాటై..

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం గతేడాది కొత్తగా ఏర్పాటైంది. అంతకుముందు వరకు పటాన్‌చెరు నియోజకవర్గం.. సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో కొనసాగింది. పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్ మండలాలతో కొత్తగా పటాన్‌చెరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటైనా.. సంవత్సరం నుంచి సంగారెడ్డి కార్యాలయంలోనే ప్రత్యేకంగా కొనసాగుతుండడం గమనార్హం.

గజ్వేల్‌లో తగ్గి.. దుబ్బాకలో పెరిగి..

2022-23 ఆర్థిక సంవత్సరం పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో గజ్వేల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో ఆదాయం గణనీయంగా తగ్గింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో 12,957 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.58.88 కోట్ల ఆదాయం వచ్చింది. కానీ గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 2,117 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు తగ్గడంతో 39.29 శాతం మేర ఆదాయం తగ్గింది. రూ.35.74 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అదే సమయంలో దుబ్బాక సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాబడి పెరిగింది. ఈ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,272 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 3.18 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే, 2023-24 సంవత్సరంలో 342 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పెరగడంతో రాబడి 48.12 శాతం మేర పెరిగింది. అదనంగా రూ.4.71 కోట్లు ఖజానాకు చేరాయి.

పటాన్‌చెరు రికార్డు

పటాన్‌చెరు ప్రాంతంతో కలిసి ఉన్న సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 2022-23లో 39,906 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రభుత్వ ఖజానాకు రూ.634.09 కోట్ల ఆదాయం చేకూరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 9,548 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగి రూ.5.97 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ఇదే సంవత్సరం సంగారెడ్డి నుంచి విడదీసి కొత్తగా ఏర్పాటు చేసిన పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 37,784 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగి.. ఖజానాకు రూ.768.34 కోట్ల ఆదాయం ఖజానాకు సమకూరింది.

సిటీ శివారులోనే అత్యధికం

పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి అంతా హైదరాబాద్ శివారు ప్రాంతంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రాంతాలే. ఈ ప్రాంతాలలో ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ ధర చ.గ.కు రూ. వేలల్లో ఉన్నది. పైగా ఈ ప్రాంతలో ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోళ్లు ఎక్కువ సంఖ్యలోనే జరుగుతుంటాయి. ఈ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోనే ఔటర్‌రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న తెల్లాపూర్, కొల్లూరు, ఉస్మాన్‌నగర్, పాటి తదితర గ్రామాలలో నిర్మాణమవుతున్న అపార్ట్‌మెంట్ల సంఖ్య వందల్లో ఉన్నాయి. అలాగే వెంచర్లు కూడా ఏర్పాటయ్యాయి. అందుకే ఈ ప్రాంతంలో ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు ఎక్కువ సంఖ్యలో జరుగుతుండడంతో ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం ఏ యేటి కా యేడు పెరుగుతూనే ఉండడం విశేషం.

కోడ్ అమలులో ఉన్నా..

గత అక్టోబరు, నవంబరు నెలలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయినా ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కడ కూడా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు ఆగలేదు. అయితే అంతకుముందు నెలతో పోల్చితే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు కొన్ని ప్రాంతాల్లో తగ్గి, మరికొన్ని ప్రాంతాల్లో పెరిగాయి. ఫలితంగానే 2022-23 ఆర్థిక సంవత్సరం కన్నా.2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పెరగడానికి దోహదపడింది.

అక్రమంగా చెట్ల నరికివేత

శివ్వంపేట, ఏప్రిల్ 2: సంగారెడ్డి-తూప్రాన్ ప్రధాన రోడ్డు సమీపంలోని విలువైన చెట్లను ఇష్టానుసారంగా నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని చండి సమీపంలో కొందరు అక్రమ కలప వ్యాపారులు భారీ వృక్షాలను యంత్రాల సహాయంతో నరికివేసి తరలిస్తున్నారు. ఓ వైపు మొక్కలు పెంచాలని చెప్పే అధికారులు మరోవైపు విలువైన చెట్లు అక్రమంగా నరుకుతున్నా పట్టించుకోకపోవడం విశేషం.

హాస్టల్ విద్యార్థులకు నీళ్ల చారు!

● మెనూ పాటించని సిబ్బంది

● మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామన్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్





గిర్మాపూర్ హాస్టల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి వడ్డించిన అన్నం, నీళ్లచారు

కొండాపూర్, ఏప్రిల్ 2: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అన్నం, కారం నీళ్ల సాంబరును వడ్డించారు. దీంతో అన్నం తినలేక విద్యార్థులు చెత్త డబ్బాలో పారబోశారు. మంగళవారం మధ్యాహ్న భోజనానికి బీట్‌రూట్, లేదా క్యారెట్ కర్రీ, టమాటా పప్పు, రసం, పెరుగు, పచ్చళ్లు అని హాస్టల్ మెస్‌లోని బోర్డుపై డిస్‌ప్లేలో రాసి ఉంచారు. కానీ మెనూ పాటించని సిబ్బంది నీళ్లలో కారం కలిపి ఉన్న నీళ్ల చారును విద్యార్థులకు వడ్డించడంతో తినలేక చెత్త డబ్బాలో పడేశారు. ఈ విషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆలీని వివరణ కోరగా.. మెస్ ఇన్‌చార్జిగా ఉన్న అధికారి బాధ్యతలను నిన్ననే చార్జి తీసుకున్నానని, మంగళవారం ఎన్నికల విధుల శిక్షణకు వెళ్లినట్లు తెలిపారు. ఉదయం మెస్‌లో పనిచేస్తున్న సిబ్బందికి మెనూలో ఉన్నవాటి ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని సూచించామన్నారు. మార్కెట్‌లో సమయానికి కూరగాయలు దొరక్క ఆలస్యం కావడంతో.. చేసేది లేక ఉన్నవాటిని విద్యార్థులకు వడ్డించారని చెప్పారు. మళ్లీ ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూస్తామని వెల్లడించారు.

నేత్రపర్వం.. నాచగిరీశుడి బ్రహ్మోత్సవం..

● గజవాహనంపై ఊరేగిన లక్ష్మీనృసింహస్వామి




గజ వాహనంపై నాచగిరి పుర వీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనృసింహస్వామి

వర్గల్, ఏప్రిల్ 2: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి గజవాహనోత్సవ సేవ నిర్వహించారు. స్వర్ణాలంకరణ శోభితులైన లక్ష్మీనరసింహస్వామి దేవతామూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించిన గజవాహనంపై అధిష్ఠింపజేసి భాజాభజంత్రిలు, మేళతాళలు, వేదమంత్రాల మధ్యన నాచగిరి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. భక్తుల భద్రత దృష్ట్యా గౌరారం పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఎండలతో జాగ్రత్త

● పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

● అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలంటున్న వైద్యులు





ఎండ వేడిమి వల్ల మధ్యాహ్నం జన సంచారం లేక బోసిపోయిన సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తా

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 2: భానుడు అప్పుడే తన ప్రతాపాన్ని మొదలెట్టాడు. సెగలు కక్కుతూ ఎండలతో జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. దీంతో అనారోగ్యం బారినపడే అవకాశం ఉందంటున్నారు వైద్యులు. ఇప్పటికే మెదక్ జిల్లా అంతటా రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్నది. వాస్తవానికి మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ మార్చి నెలాఖరు నుంచే ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. గతవారం రోజుల నుంచి 40 నుంచి 41 పైబడి వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 నుంచి మొదలైన ఎండవేడిమి సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగుతున్నది. ఉపాధిహామీ, దినసరి కూలీలు, రోజు పనులు చేసుకొనే వారు తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తున్నది. వారు తలకు రుమాలు, గొడుగు తీసుకెళ్లడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. లేకపోతే ఎండ దెబ్బ కొట్టే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీ, ఫ్రిడ్జ్‌లను ఎక్కువగా కొనుగోళ్లు చేస్తున్నారు. అలాగే ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం మజ్జిగ, కొబ్బరిబోండాలకు తాగుతున్నారు. పుచ్చకాయలు, కీరదోస తినడానికి ఆసక్తి చూపిస్తున్నారు.



ఎండలు పెరిగిపోవడంతో నిర్మానుష్యంగా మారిన మెదక్ రాందాస్ చౌరస్తా

వడదెబ్బ లక్షణాలు

- తలనొప్పి, తల తిరగడం
- తీవ్రమైన జ్వరం రావడం
- మత్తు, నిద్ర, కలవరింతలు, మూర్ఛ
- కొంచెం లేదా పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం కూడా జరుగుతుంది.



కరీంనగర్ రోడ్డులో ఎండ నుంచి చల్లదనం కోసం పుచ్చకాయలు తింటున్న స్థానికులు

చర్మం పొడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మాములు రోజుల కంటే ఒక లీటర్ నీరు ఎక్కువగా తాగాలి.
- చర్మం పొడిబారకుండా చూసుకోవాలంటే డీ హైడ్రేషన్ గురికాకుండా శరీరంలో తేమ కోల్పోకుండా చూసుకోవాలి.
- ఎండకు వెళ్లేముందు రోజ్ నీటిని ముఖంపై పూసుకుంటే మంచిది.
- నీటితో కలిపిన మాయిశ్చరైజింగ్ క్రీమును పూసుకోవాలి.
- ఎక్కువసార్లు సబ్బుతో కడగకూడదు.
- వీలైనన్ని సార్లు చల్లటి నీటితో కడుక్కోవడం ఎంతో మంచిది.

అలసత్వం వద్దు



ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లకూడదు. ఒకవేళ వెళ్తే తలకు రుమాలు లేదా టోపీ, నీటి బాటిల్ వెంట తీసుకెళ్లాలి. మధ్యాహ్నం ఆల్కహాల్ తీసుకోకూడదు. ఒకవేళ ఆల్కహాల్ తీసుకున్నట్లైతే స్వేద రంధ్రాలు తెరుచుకుని చెమట రూపంలో గ్లూకోస్ వెళ్లిపోయి ఎక్కువగా డీహైడ్రేషన్ గురవుతారు. కొన్నిసార్లు ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంటుంది. తరచూ ఓఆర్ఎస్, మజ్జిగ లాంటివి తీసుకోవాలి.

- పిప్పిరి చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త, మెదక్

ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తెలుపు రంగు పలుచటి కాటన్ దుస్తులను తొడుక్కోవాలి.
- బయటకు వెళ్లే ముందు నెత్తికి టోపీ లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీటిని తాగాలి.
- వడదెబ్బ తగిలిన వారిని వెంటనే చల్లటి ప్రాంతానికి తీసుకెళ్లాలి.
- వడ దెబ్బకు గురైన వారిని తడిగుడ్డతో శరీరం అంత తుడుస్తూ ఉండాలి.
- ఐస్ నీటిలో వస్త్రాన్ని ముంచి శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత 101 ఫారన్‌హీట్ డిగ్రీస్ కంటే తక్కువ వచ్చేవరకు తుడుస్తూ ఉండాలి.
- వడదెబ్బకు గురైనవారు సాధారణ స్థితికి రాకపోతే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.
- ఎండ నుంచి ఇంటికి రాగానే చల్లని నిమ్మరసం లేదా కొబ్బరినీరు, మంచినీరు తాగాలి.
- తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తల తిరుగుడు, ఇతర సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

ఎండలు తీవ్రంగా ఉంటే ఇలా చేయకూడదు

- సూర్య కిరణాలకు, వేడి గాలికి గురికాకూడదు.
- ఎండలో వెళ్తే గొడుగు తీసుకెళ్లాలి.
- వేసవి కాలంలో నలుపు, మందంగా ఉన్న దుస్తులు ధరించకూడదు.
- వడదెబ్బకు గురైనవారిని వేడినీటిలో ముంచిన వస్త్రంతో తుడవద్దు.
- ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ఆలస్యం చేయకూడదు.
- ఉదయం 10 నుంచి 4 గంటల మధ్యలో ఎండలో వెళ్లకుండా చూసుకోవాలి. ఒకవేళ వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండలోంచి ఇంటికి రాగానే తీపి పదార్థాలు, తేనె తీసుకోకూడదు.
- శీతలపానీయాలు, మంచు ముక్కలు వంటివి తీసుకుంటే గొంతుకు సంబంధించిన సమస్యలు రావచ్చు.

బీఆర్ఎస్‌కు శ్రీకృష్ణ జన్మస్థానం ప్రాప్తిరస్తు

● బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

● మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో ప్రచారం



మద్దూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న బూర నర్సయ్యగౌడ్

మద్దూరు/ధూళిమిట్ట, ఏప్రిల్ 2: బీఆర్ఎస్ గల్లీలో లేదు, ఢిల్లీలో లేదని ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొద్దిరోజుల్లో చంచల్‌గూడ జైల్లో ఉంటారంటూనే.. శ్రీకృష్ణ జన్మస్థానం ప్రాప్తిరస్తని బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని లద్నూరు, మద్దూరు గ్రామాల్లో కార్యకర్తల వ్యధ ప్రజా తెలంగాణ యాత్రలో భాగంగా పర్యటించారు. మద్దూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు షాపుల యజమానులను కలిసి బీజేపీకి ఓటేయాలని కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం పార్టీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ మోదీ గళం.. యువత బలం అని, మన భవిష్యత్తు, దేశ భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు కోసం మోదీని గెలిపించాలని కోరారు. దేశంలో మోదీ.. భువనగిరిలో బూర ఉండాలన్నారు. కాంగ్రెస్‌ది అభయహస్తం కాదని భస్మాసుర హస్తం అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌గౌడ్, ప్రచార కన్వీనర్ బల్ల శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ కూరెల్ల రాజుగౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

తనను ఆశీర్వదిస్తే..

తనను ఆశీర్వదించండి.. బైరాన్‌పల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా చేస్తానని బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామంలోని బురుజు వద్ద రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు వదిలిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం బురుజు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆనాటి ఉద్యమకారులను సన్మానించి మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత వీరబైరాన్‌పల్లి గ్రామం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని, విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకోవచ్చు అని అనుకున్నాం. కానీ మత రాజకీయాలకు తలొగ్గి కేసీఆర్ వీరబైరాన్‌పల్లి చరిత్రను కప్పివేసే ప్రయత్నం చేస్తే.. సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించిన ఘనత నరేంద్రమోదీకి, బీజేపీకి దక్కుతున్నదన్నారు. అనంతరం తర్వాత దూళిమిట్ట మండల కేంద్రంలో పర్యటించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి,బీజేపీ దూళిమిట్ట మండలాధ్యక్షుడు సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

తాళం తీయని యజమాని.. తెరుచుకోని ఈఎస్ఐ

● బయటే కూర్చున్న సిబ్బంది ● రోగులకు అందని సేవలు

తూప్రాన్, ఏప్రిల్ 2: ఇంటి అద్దె చెల్లించకపోవడం ఈఎస్ఐ డిస్పెన్సరీకి వేసిన తాళం ఇంకా తీయలేదు. ఈఎస్ఐ డిస్పెన్సరీ తాళం తీయకపోవడంతో మంగళవారం కూడా రోగులకు సేవలు అందలేదు. మధ్యాహ్నం వరకు బయటే కూర్చున్న సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి వద్ద నిర్వహిస్తున్న శభాష్ పల్లి ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె చెల్లించడం లేదని సోమవారం తాళం వేసిన సంగతి తెలిసిందే. కాగా, ఇంటి యజమాని ప్రతాప్‌రెడ్డికి అద్దె చెల్లించకపోవడంతో మంగళవారం కూడా తాళం తీయలేదు. కనీసం ఈఎస్ఐ అధికారులు ఇంటి యజమానితో మాట్లాడలేదని తెలిసింది. ఈఎస్ఐ డిస్పెన్సరీ తాళం తీయకపోవడంతో విధులకు వచ్చిన సిబ్బంది మధ్యాహ్నం 1 గంటల వరకు అక్కడే కూర్చుని వెళ్లిపోయారు. డిస్పెన్సరీకి వచ్చిన రోగులకు పరిస్థితి వివరించి రోగులకు సేవలు అందజేయకుండానే పంపించారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు బిందుసాగర్



బిందుసాగర్

పుల్‌కల్, ఏప్రిల్ 2: జాతీయస్థాయి ఖోఖో పోటీలకు మండల కేంద్రం చౌటకూర్‌కు చెందిన బుర్కల బిందుసాగర్ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని దోమలగూడ వ్యాయామ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపెడ్) చదువుతున్నాడు. జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో గతనెలలో జరిగిన సీనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొని ఎంపికయ్యాడు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగనున్న 56వ జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున బిందుసాగర్ ఆడనున్నాడు. ఈ సందర్భంగా తెలంగాణ జట్టుకు ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్కుం నాగాగౌడ్ క్రీడా కిట్టును అందజేశారు. బిందుసాగర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికకావడం పట్ల ఖోఖో ఉమ్మడి మెదక్ జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణముదిరాజ్ అభినందించారు.

టెక్స్ అకాడమీ గ్రూప్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

● కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్‌దాస్

పుల్‌కల్, ఏప్రిల్ 2: విద్యార్థులకు ఉద్యోగావకాశాల కోసం ఉచిత కోర్సు శిక్షణతో పాటుగా టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ సీ.మోహన్‌దాస్ తెలిపారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీ సహకారంతో ఉపాధి నైపుణ్యాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉచిత కోర్సులు, ప్లేస్‌మెంట్ అందించే డ్రైవ్‌లు విద్యార్థుల కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహ మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకుని, కేరీర్ ఎంపికలకు సన్నద్ధం కావాలని సూచించారు. కాగా, చౌహాన్ వంశీకృష్ణ, అరవపల్లి త్రివేణి, బండారి తిరుపతి, కోరోల్ల శ్రీకాంత్, కొండుపర్తి రాజాశ్రీకర్, కె.స్రవంతిలు ఉచిత కోర్సులు, ఉద్యోగావకాశాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, ట్రైనింగ్ అండ్ ప్లెస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ జోషీశ్రీపాద్ పాల్గొన్నారు.

గురుకుల లా విద్యార్థికి బెస్ట్ ఓరల్ ప్రజంటేషన్ అవార్డు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 2: సంగారెడ్డిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల లా కాలేజీ విద్యార్థి అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభ కనబర్చి అత్యుత్తమ అవార్డు అందుకున్నారు. ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్, పలు విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా సోమవారం బ్యాంకాక్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డిలోని న్యాయ కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మిట్టకడప తిరుపతి పాల్గొన్నారు. 'ఏ క్రిటికల్ స్టడీ-ద లా కమిషన్ అండ్ ఇట్స్ లీగల్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా' అనే పేపర్‌ను కాన్ఫరెన్స్‌లో ప్రజెంట్ చేశారు. ఇందుకు తిరుపతి బెస్ట్ ఓరల్ ప్రజంటేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. అనంతరం కాన్ఫరెన్స్ ముగింపులో అసోసియేషన్ ప్రతినిధులు విద్యార్థి తిరుపతికి అవార్డును అందజేసి అభినందించారు. తిరుపతికి అవార్డు దక్కడం పట్ల గురుకుల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం వ్యక్తం చేశారు.

సిద్ధాపూర్‌లో ఎక్సైజ్ అధికారుల దాడులు

● 82 గంజాయి మొక్కలు ధ్వంసం



సిద్దాపూర్‌లో గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఝరాసంగం, ఏప్రిల్ 2: ఝరాసంగం మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో జొన్న పొలంలో అంతర పంటగా సాగుచేస్తున్న 82 గంజాయి మొక్కలను మంగళవారం ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నమ్మదగ్గ సమాచారం మేరకు గ్రామానికి చెందిన హుస్సేన్‌బాబా తనజొన్న పొలంలో గంజాయి సాగు చేస్తున్నాడన్నారు. పొలంలోకి వెళ్లి పరిశీలించగా 82 గంజాయి మొక్కలు ఉన్నాయన్నారు. వెంటనే తమ సిబ్బందితో కలిసి ధ్వంసం చేశామని పేర్కొన్నారు. అక్కడే ఉన్న హుస్సేన్‌బాబా అల్లుడు యాదుల్‌ను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మొక్కల విలువ సుమారు రూ.8.20 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టని దివాలాకోరు కాంగ్రెస్ ప్రభుత్వం

● ఎండిన పంటలకు పరిహారం అందించాలి

● రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలి

● సంగారెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న చింతా ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 2: రైతుల కష్టాలను దివాలకోరు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సంగారెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ అన్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపుమేరకు రైతులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావులతో కలిసి కలెక్టరేట్ డీఆర్వోకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు అన్ని పంటలపై ఎకరాకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే 6న కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని చింతా ప్రభాకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 2: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి ఆరు గ్యారంటీలను కూడా అమలు చేయలేకపోయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు ధాన్యం కొనుగోలుపై ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

సింగూరు గురుకుల విద్యార్థులకు అంతర్జాతీయ అవార్డులు

పుల్‌కల్, ఏప్రిల్ 2: మండలంలోని సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ముంబయికి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరిలో నిర్వహించిన ఆర్ట్ పోటీలలో సింగూరు గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు వివిధ విభాగంలో అంతర్జాతీయ అవార్డులు సాధించారు. విద్యార్థులు సోయం మాలిక్ స్కెచ్చింగ్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించారు. దీంతోపాటుగా మరో ఇద్దరికీ ఆర్ట్ మెరిట్ అవార్డులు, 15 మంది విద్యార్థులకు ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ అవార్డులు, ఐదుగురికీ కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. వివిధ ఆర్ట్ విభాగంలో సింగూరు ఎస్సీ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.రామకృష్ణ వరల్డ్ వైడ్ ఎక్సలెన్స్ పర్ఫామెన్స్ అవార్డు సాధించారు. ఆర్ట్ టీచర్ ఎంపీ శ్రీపాద్ వరల్డ్ ఫేమస్ ఆర్టిస్ట్ సాల్వడార్ డాలీ అవార్డు పొందారు. పాఠశాల, కళాశాలకు అంతర్జాతీయ గ్లోబల్ స్కూల్ అవార్డును వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌కిరణ్ అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో వై.మల్లికార్జున్, జి.ప్రవీణ్‌కుమార్, ఎస్.రమేశ్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 2: పటాన్‌చెరు మండలం లక్డారం, ఇస్నాపూర్ చౌరస్తాలో, సంగారెడ్డి మండలం కందిలో, పటాన్‌చెరు బస్టాప్ వద్ద ప్రతిరోజూ భారీగా ట్రాఫిక్ జామ్ అవుతూ వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కొత్తగా యూటర్న్‌లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ రద్దీని నియంత్రించినట్లు చెప్పారు. ఆయాటర్న్‌లను ఎస్పీ మంగళవారం పరిశీలించి మాట్లాడారు. జాతీయ రహదారిపై మాత్రమే కాకుండా పట్టణాల్లో పలు ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌లను ఏర్పాటు చేయడం, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న కొన్ని యూటర్న్‌లను మూసివేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారిపై పలు ప్రధాన కూడళ్లలో 52 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ వెంట పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి ఉన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



రాపర్తిలో అధికారులకు సూచనలిస్తున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్

కల్హేర్, ఏప్రిల్ 2: వేసవి కాలంలో గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. మండల పరిధిలోని రాపర్తి, మీర్‌ఖాన్‌పేట్, బాచేపల్లి, మాసాన్‌పల్లి గ్రామాల్లో తాగు నీటి సరఫరా, పంటల పరిస్థితి తదితర సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు ఇస్తూ వేసవి కాలం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండలు పెరిగినందున ప్రజలకు జాగ్రత్తలతో పాటు వడదెబ్బపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యపనులు విధిగా చేపట్టాలన్నారు. అనంతరం అన్ని గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు ఉన్నారు.

జీర్గి తండాను సందర్శించిన అదనపు కలెక్టర్

కంగ్టి, ఏప్రిల్ 2: మండల పరిధిలోని జీర్గి తండాను మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా సందర్శించారు. తండాలో తాగునీటి సరఫరా విషయమై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ సరఫరాలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. అస్తవ్యస్తంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని డీఈని ఆదేశించారు. అనంతరం పాఠశాలకు కొత్తగా వచ్చిన ఫర్నిచర్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఎల్‌పీవో సంజీవ్‌రావు, ఎంపీడీవో సత్తయ తదితరులు ఉన్నారు.

బహుజన పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్

బహుజన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతి కార్యక్రమాలను మంగళవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సర్వాయిపాపన్న చిత్రపటాలు, విగ్రహాలకు పలు సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ పాపన్నగౌడ్ పోరాటపటిమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



సంగారెడ్డిలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం, కేజీకేఎస్ నాయకులు



మెదక్‌లో పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 2: అన్ని వర్గాలవారు అభివృద్ధి చెందాలని బడుగు బలహీనవర్గాల పక్షాన పోరాడిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కనాగరాజు గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ పేర్కొన్నారు. పాపన్న 314వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సంగారెడ్డిలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సర్వాయి పాపన్న ఆశయ సాధనకు పాటుపడుతూ, సామాజిక న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మల్లాగౌడ్, గౌడజన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరిగౌడ్, అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపూర్:** మండలంలోని గొల్లపల్లిలో సంగారెడ్డి జిల్లా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

● **వట్‌పల్లి:** గౌడసంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు అశోక్‌గౌడ్, నరసింహగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌గౌడ్, ఎల్లాగౌడ్, సువాన్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** కల్లుగీతకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఖేడ్‌లో పాపన్నగౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్, సంఘం బాధ్యులు, నాయీబ్రాహ్మణ, అంబేద్కర్ సంఘం నాయకులు, బీంసేన తదితరులు సర్వాయిపాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **జహీరాబాద్:** పట్టణంలోని శ్రీనివాస్ మహల్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు దత్తుగౌడ్, మాణయ్యగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, విఠల్ గౌడ్, మాణిక్‌ప్రభుగౌడ్, అంజయ్యగౌడ్, హన్మాగౌడ్, రంగాగౌడ్, తుల్జారాంగౌడ్ పాల్గొన్నారు.

● **మెదక్ అర్బన్:** సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా మెదక్‌లోని స్థానిక పసుపులేరు వద్ద ఏర్పాటు చేసిన పాపన్న విగ్రహానికి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎంఎల్‌ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **రామాయంపేట:** పట్టణంలోని ఎల్లమ్మ ఆలయం ఎదుట సర్వాయి పాపన్న విగ్రహానికి గౌడసంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీకొని ఇద్దరు బాలురు మృతి



నాదిల్, రేహాన్(ఫైల్)

జహీరాబాద్, ఏప్రిల్ 2: లారీ, ద్విచక్రవాహనం ఢీకొని మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు బాలురు మృతిచెందారు. పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఎండీ నాదిల్(15), ఎండీ రేహాన్(17)లు బైక్‌పై ఖాన్‌మహేళా నుంచి పాత ఆర్టీవో చెక్‌పోస్టు వైపు బయలుదేరారు. ఈ క్రమంలో బాగారెడ్డి విగ్రహం వద్దకు చేరుకోగానే రాంనగర్ వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నాదిల్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలకు గురైన రేహాన్‌ను సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాలకు జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. బాధిత కుటుంబ సభ్యుడు సమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

ఔటర్ రహదారిపై కారు ఢీకొని వ్యక్తి..

జిన్నారం, ఏప్రిల్ 2: ఔటర్ రింగ్ రోడ్డు పై కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించినట్లు బొల్లారం సీఐ గంగాధర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1న రాత్రి 11గంటల ప్రాంతంలో కాజీపల్లి శివారు ఔటర్ రింగ్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న షేక్ ఇషాక్ (54)ను ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇషాక్ తల, చేయి, కాళ్లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడు ఖైరతాబాద్ ఏసీ గార్డ్స్‌కు చెందిన వాడు. కొడుకు రుమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మానసిక వేదనతో ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

మనోహరాబాద్, ఏప్రిల్ 2: మానసిక వేదనతో ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కందల శ్రీనివాస్(42) సోమవారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదేళ్ల క్రితం శ్రీనివాస్ రోడ్డు ప్రమాదానికి గురైన నాటి నుంచి ఆరోగ్యం సహకరించక ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన శ్రీనివాస్ సోమవారం సాయంత్రం తాను పొలం వద్ద పడుకుంటానని ఇంట్లో వారికి ఫోన్ ద్వారా చెప్పాడు. రాత్రి అక్కడే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. భార్య కందల పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హైవేపై ఆటో పల్టీ

రామాయంపేట, ఏప్రిల్ 2: హైదరాబాద్ వైపు నుంచి రామాయంపేటకు వెళ్తున్న ప్యాసింజర్ ఆటో అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనలో డ్రైవర్ ఆటోలో ఇరుక్కుపోగా స్థానికులు అతడిని కాపాడారు.

మూడు ట్రాక్టర్లను దహనం చేసిన దుండగులు



దామర్‌గిద్ద శివారులో కాలిన ట్రాక్టర్

కంగ్టి, ఏప్రిల్ 2: నిలిపి ఉంచిన మూడు ట్రాక్టర్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన సంఘటన సోమవారం రాత్రి మండల పరిధిలోని పంచమహల్ దామర్‌గిద్ద శివారులో జరిగింది. ఎస్ఐ విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ 15 ఎఫ్‌జీ 1493, ఏపీ 26 బీఆర్6962, టీఎస్17టీ5937 నెంబర్లు గల ట్రాక్టర్‌తో కొందరూ రైతులు సోమవారం పొద్దంతా మట్టిని తరలించారు. డ్రైవర్లు రాత్రి గ్రామ శివారులో నిలిపి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు మూడు ట్రాక్టర్లకు నిప్పంటించడంతో ట్రాక్టర్లు కాలిపోయాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చేగుంటలో తాళం వేసిన ఇంట్లో చోరీ

● రూ. 11 లక్షలు అపహరించిన గుర్తు తెలియని దుండగులు

చేగుంట, ఏప్రిల్ 2: తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని దొంగలు రూ.11 లక్షలను అపహరించారు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సోమ పరశురాములు తన భూమిని విక్రయించగా వచ్చిన డబ్బును ఇంట్లో బీరువా దాచుకున్నాడు. మక్కరాజ్ పేటలో బంధువుల ఇంటికి భార్య వజ్రమ్మ వెళ్లగా, పరశురాములు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి చేగుంటలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద సిమెంటు సంచుల కాపల కోసం వెళ్లి అక్కడే పడుకున్నాడు. ఉదయం ఇంటికి వెళ్లి చూచేసరికి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.11 లక్షల నగదు చోరీ అయ్యాయని బాధితుడు వాపోయాడు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటేష్, సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. చేగుంట ఎస్ఐ బాలరాజ్ కేసు నమోదు చేశారు.

తాళం వేసి ఉన్న పెళ్లివారింట్లో..

శివ్వంపేట, ఏప్రిల్ 2: కొడుకు వివాహం రోజు ఇంటికి తాళం వేసి వివాహానికి వెళ్లిన సమయంలో దొంగలు తాళాలు పగులగొట్టి ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని చిన్నగొట్టిముక్లలో చోటు చేసుకున్నది. మంగళవారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగొట్టిముక్లకు చెందిన మధిర శంకరయ్య కొడుకు దశరథ వివాహం ఉండడంతో సోమవారం ఇంటికి తాళం వేసి శంకరంపేటలో పెళ్లికి వెళ్లారు. కాగా గుర్తు తెలియని దుండగులు సోమవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఐదు చీరలు, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనంతో పాటు మరికొంత సామగ్రి ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. మంగళవారం ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.5.80 లక్షలు సీజ్

హవేళిఘణపూర్, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో మెదక్ - బోధన్ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.5 లక్షల 80 వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఎస్ఐ ఆనంద్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ అనే వ్యక్తి ఎల్లారెడ్డి నుంచి మెదక్ వైపు వస్తుండగా పోలీసులకు ఎలాంటి ఆధారం చూపించకపోవడంతో డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున డబ్బుకు సంబంధించి పత్రాలు వెంట ఉండాలన్నారు.

కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద రూ.70వేలు



కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం కాపీని అందజేస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

మనోహరాబాద్, ఏప్రిల్ 2: మండలంలోని కాళ్లకల్ ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.70వేలు పట్టుబడ్డాయి. హైదరాబాద్ నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న ముద్రకోల నరేష్ అనే వ్యక్తి ఎలాంటి పత్రాలు చూపించకుండా రూ. 70 వేల నగదును తీసుకువెళ్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు సీజ్ చేసిన డబ్బును సిద్దిపేట డీటీవో ఆఫీస్‌కు తరలించినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

సామాన్యులకు ఇబ్బంది కలిగించొద్దు: సీఐ

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 2: సామాన్య ప్రజల జన జీవనానికి ఇబ్బందులు కలిగించొద్దని పట్టణ సీఐ ఎస్.భాస్కర్ సూచించారు. పట్టణంలోని ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులకు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై పువ్వులు, పండ్ల షాప్‌లను ఏర్పాటు చేయడంతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులతో పాటు రోడ్డుప్రమాదాలకు దారి తీస్తున్నట్టు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసినా, వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ప్రభుత్వ పంపిణీ రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. జహీరాబాద్ పట్టణంలో మంగళవారం సయ్యద్ తాజొద్దీన్, డ్రైవర్ మౌలానా అనే ఇద్దరు 90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రైతు నేస్తం కార్యక్రమంలో కనిపించని రైతులు

కొల్చారం, ఏప్రిల్ 2: గ్రామీణ ప్రాంత రైతులకు ఆధునిక సాంకేతిక విజ్ఞానం, నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతీ మంగళవారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలతో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమానికి కొల్చారం మండలంలో రైతులెవరూ హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. స్థానిక వ్యవసాయ సిబ్బంది ప్రతి మంగళవారం కొల్చారంలోని రైతువేదికలో రైతు నేస్తం శిక్షణ ఉంటుందని అవగాహన కల్పించడంలో విఫలం చెందడంతో రైతులు హాజరు కావడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు వారాలుగా జరుగుతున్న రైతునేస్తం కార్యక్రమానికి కేవలం వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ డిపార్టుమెంటు సిబ్బంది మాత్రమే హాజరవుతున్నారు.

మూడురోజులుగా నీటికోసం ఇబ్బంది పడుతన్న విద్యార్థులు

శివ్వంపేట, ఏప్రిల్ 2: మండలంలోని గోమారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోరుమోటరు చెడిపోవడంతో గత మూడురోజులుగా విద్యార్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం భోజన సమయంలో తాగడానికి నీరు లేక వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇప్పటికైనా మోటరు బాగుచేసి నీటి ఇబ్బంది తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ సహజం

నర్సాపూర్, ఏప్రిల్ 2: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదవీ విరమణ సహజమే కాని విధి నిర్వహణలో చేసిన మంచిపనులే కలకాలం ఉంటాయని మండల విద్యాధికారి బుచ్యానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాగజ్‌మద్దూర్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, రామకృష్ణరావు, సూర్యప్రకాష్, నాజియా, మాజీ సర్పంచ్ శివకుమార్, శ్రీశైలం, బాలచంద్రం, మల్లేశం, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సురేష్, అప్పలనాయుడు, కవిత తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకూ నీటి సరఫరా జరగాలి



జంలాతండా వద్ద నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులు

కల్హేర్, ఏప్రిల్ 2: వర్షాకాలంలో నల్లవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నా చివరి ఆయకట్టుకు మాత్రం సాగునీరు అందడంలేదని, ప్రస్తుతం చేపట్టే కాలువల ఆధునీకరణతోనైనా చివరి ఆయకట్టుకు నీరు చేరేలా పకడ్బందీగా పనులు చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి, నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మండల పరిధిలోని బీబీపేట్, జంలాతండా, తుకారాంతండా శివారులో కొనసాగుతున్న ప్రాజెక్టు కుడి కాలువ ఆధునీకరణ పనులను, కుడి కాలువ 4వ డిస్ట్రిబ్యూటర్ ద్వారా సరఫరా అవతుఉన్న సాగు నీటిని వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మూడు కిలోమీటర్ల మేర కాలువపై నడుచుకుంటూ ఆధునీకరణ పనులు, నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా నల్లవాగు ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు సాగు నీరు చేరకపోవడంతో మార్డి, ఇందిరానగర్, కల్హేర్, క్రిష్ణాపూర్ గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అందువల్లే నిలిచిపోయిన కాలువల పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి అదనంగా నిధులు మంజూరు చేయిస్తా కానీ చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సరఫరా కావాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి నీటిపారుదల శాఖ అధికారుల సమక్షంలో తెలిపారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా చూడాలని సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ మురళీధర్ కాంట్రాక్టరుకు సూచించారు. రైతుల భూములకు సాగు నీరు అందడానికి అవసరమైన విధంగా కిందిస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. కాలువలకు అక్రమంగా గండ్లు కొట్టి నీటి చౌర్యానికి పాల్పడే వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని అధికారులు నల్లవాగు ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ జైభీం, డీఈ పవన్‌కుమార్, ఏఈ సూర్యకాంత్, సీడీసీ మాజీ చైర్మన్ ఎన్నం నర్సింహారెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ గుండు నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో వెనకబడిన జహీరాబాద్ బల్దియా



జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం


జహీరాబాద్, ఏప్రిల్ 2: జహీరాబాద్ మున్సిపాలిటీలో సిబ్బంది కొరతకు తోడుగా అధికారులనిర్లక్ష్యం, ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం ఫలితంగా 2023-24 సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్లలో లక్ష్యాన్ని సాధించలేకపోయారు. ప్రతీసారి సగటున 80% మేర పన్నులు వసూలవుతుండగా ఈ ఏడాది ఏకంగా 55% మేరకే వసూలు కావడంపై అధికారుల్లో ఆందోళన మొదలైంది. మున్సిపాలిటీలో సుమారు 30మంది సిబ్బంది ఉండగా, 13మంది డిప్యూటేషన్‌పై ఉండడం, ఉన్న అరకొర సిబ్బందిని ఎన్నికల విధుల్లో ఉపయోగించుకోవడంతో పన్నువసూళ్ళపై ప్రభావం పడిందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే మున్సిపాలిటీలో సిబ్బంది కొరతకు తోడుగా వివిధరకాల సమస్యలకు పరిష్కారం లభించకపోగా, కొందరు తమ పన్నులు అధికంగా వస్తున్నాయని ఏ ప్రాతిపదికన పన్నులు వేశారంటూ సిబ్బందితో వాగ్వాదాలకు దిగారు. సమస్యలను పరిష్కరిస్తే తప్ప పన్నులు చెల్లించలేమంటూ మండిపడ్డారు. దీంతో సిబ్బంది ఎంతగా యత్నించినప్పటికీ పన్నులు వసూలు కాని పరిస్థితి నెలకొన్నది. గత నాలుగైదేళ్ళుగా జహీరాబాద్ మున్సిపాలిటీలో సుమారు 90 శాతం వరకు పన్ను వసూళ్లు కాగా, ఈ ఏడాది 55శాతం దాటలేని పరిస్థితి ఏర్పడింది. 2023-24 సంవత్సరానికి గానూ రూ.18,275 గృహ, వ్యాపార సముదాయాలు, తదితరాలు కలిసి ఉండగా అందుకుగాను రూ.10.83 కోట్ల వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు అధికారులు సుమారు రూ. 5.50 కోటు మాత్రమే వసూలు చేశారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం

2023-24 సంవత్సరానికి సంబంధించి జహీరాబాద్ మున్సిపాలిటీకి రావల్సిన పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సిబ్బంది కొరతవల్లే పన్ను వసూళ్లలో లక్ష్యం సాధించలేకపోయాం. పట్టణం అభివృద్ధి చెందాలంటే ప్రజలు తప్పకుండా పన్నులను చెల్లించి అధికారులకు సహకరించాల్సిఉంటుంది. రాయితీని సద్వినియోగం చేసుకోవాలని చెప్పినా ఫలితం లేకపోయింది. పట్టణ అభివృద్ధి దృష్ట్యా ప్రజలు వెంటనే మున్సిపల్ సిబ్బందికి సహకరించి పన్నులను వెంటనే చెల్లించాలి.

-శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్


కనుల పండువలా వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణతో వెలిగిపోతున్న ఆలయం

గుమ్మడిదల, ఏప్రిల్ 2: బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువలా కొనసాగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి భద్రకాళి సహిత వీరభద్రస్వామిని హంస వాహన సేవలో ఊరేగించారు. 3 తేదీ రాత్రి భద్రకాళీ వీరభద్రస్వామి బృంగేశ్వర వాహనసేవలో ఊరేగింపుగా వచ్చి అగ్నిగుండాలలో స్వామి వారు ప్రవేశిస్తారని వేద పండితులు తెలిపారు. బుధవారం రాత్రి స్వామి వారి అగ్నిగుండాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో శశిధర్‌గుప్తా వివరించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సోమయ్య ఆధ్వర్యంలో అశ్వవాహన సేవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వతందారులు ఆలేరు జగన్మోహన్ రెడ్డి, రాహుల్ రెడ్డి, కరణం పంతులు, గటాటి రవి, ముక్కల వెంకన్న, పొన్నబోయిన కృష్ణ భక్తులు అర్చకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన డీఆర్డీవో



పంచగామలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో జ్యోతి

నారాయణఖేడ్, ఏప్రిల్ 2: ఉపాధి హామీ పథకం ద్వారా పనులను కల్పించడంలో నిర్లక్ష్యం తగదని డీఆర్డీవో జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం మండలపరిధిలోని పంచగామలో క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీల ద్వారా పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కూలీలకు అందుతున్న కూలి వివరాలు, కొలతలు తీసుకుంటున్న విధానం, కల్పిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రోజూ ప్రతికూలీకి రూ.300లు లభించే విధంగా పని కల్పించాలన్నారు. ఆమె వెంట ఏపీవో మాణిక్‌రావు, ఫీల్డ్‌అసిస్టెంట్ బ్రహ్మంచారి, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కూలీలు డీఆర్డీవోకు మొక్కను బహూకరించారు.

ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలి

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 2: జాతీయ ఉపాధిహామీ పథకాన్ని కూలీలు సద్వినియోగంచేసుకోవాలని నాగల్‌గిద్ద ఏపీవో మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలపరిధిలోని దామర్‌గిద్ద, ఏస్కీ, గ్రామశివారులలో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు.

భద్రతాబలగాల ఫ్లాగ్‌మార్చ్

నారాయణఖేడ్,ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంగళవారం నారాయణఖేడ్‌లో కేంద్ర భద్రతా బలగాలతో కలిసి డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. బీఎస్ఎఫ్ రెండు బెటాలియన్ల బలగాలతో కలిసి పోలీసులు మంగల్‌పేట మా ఫంక్షన్‌హాల్ నుంచి రహేమాన్ ఫంక్షన్ హాల్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను శాంతి యుతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలన్నారు. ఫ్లాగ్ మార్చ్‌లో ఏఆర్‌డీఎస్పీ నరేందర్, సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు విద్యాచరణ్‌రెడ్డి, శ్రీనివాస్, అమిర్యానాయక్, సిద్దిరాములు, వెంకటేశం, డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, ఏప్రిల్ 2: రామాయంపేట, కోనాపూర్‌లో మంగళవారం సాయంత్రం కేంద్ర బలగాలతో కలిసి స్థానిక సీఐ, ఎస్ఐ, సిబ్బంది కవాతు నిర్వహించారు. ఇక్కడి ఎస్సీ కాలనీ నుంచి పోలీస్ స్టేషన్ వరకు భారీ బలగాలతో కవాతు కొనసాగింది. ప్రజలు శాంతి యుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బలగాలు ఈ కార్యక్రమం చేపట్టినట్టు సీఐ తెలిపారు.

బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి

రఘునందన్‌పై కేసు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 2: బీజేపీ నాయకుడు, మెదక్ ఎంపీ అభ్యర్థి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావుపై సంగారెడ్డి పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో రఘునందన్‌రావు ఇటీవల ప్రెస్‌మీట్ ఏర్పాటుచేసి మాజీ మంత్రి హరీశ్‌రావుపై దుర్భాషలాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రఘునందన్‌రావుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు.

రోడ్డు భద్రతకు చర్యలు చేపట్టాలి



కల్హేర్ మండల పరిధిలోని జాతీయ రహదారిపై రోడ్డు భద్రతకు సూచనలిస్తున్న అడిషనల్ ఎస్పీ

కల్హేర్, ఏప్రిల్ 2: మండల పరిధిలోని 161వ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ సిబ్బందికి సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావ్ సూచించారు. మంగళవారం జాతీయ రహదారి, మాసాన్‌పల్లి చౌరస్తాలో రోడ్ సేఫ్టీని ఆయన పరిశీలించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో వ్యక్తులు మృత్యువాత పడిన ప్రదేశాలను ఆయన పరిశీలించి అక్కడ ఏ రకమైన సౌకర్యాలు, సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలో జాతీయ రహదారి సిబ్బందికి ఆయన సూచించారు. ఆయన వెంట నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎస్ఐ వెంకటేశం, సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ప్రమాణాలు పాటించాలి

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, ఏప్రిల్ 2: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వెంకటేశ్వర్లు సొసైటీ సీఈవోలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీఏసీఎస్ సొసైటీ సీఈవోలకు నిర్వహించిన శిక్షణాకార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. రికార్డులు, రిజిస్టర్లు సరైన క్రమంలో నమోదు చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల వద్ద సరైన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారులు బ్రహ్మారావు, హరికృష్ణ, కరుణ పాల్గొన్నారు.

మెదక్ జిల్లా వ్యాప్తంగా 96 కొనుగోలు కేంద్రాలు

ఐకేపీ ఆధ్వర్యంలో రబీ సీజన్ కోసం జిల్లా వ్యాప్తంగా 96 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వాటిని వెంటనే ప్రారంభించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మందిరంలో ఏపీఎం, సీసీ, ట్యాబ్ ఆపరేటర్లు, బుక్‌కీపర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రైతులకు నీడ, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

● జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 2 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమంతో పాటు విశ్వవిద్యాలయ స్థాయి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యత తెలిసేలా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు కళాశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'తారా' దత్తత గ్రామాల్లో అవగాహన

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 2: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల దత్తత గ్రామాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని కలబ్‌గూర్, అంగడిపేట, చింతలపల్లి గ్రామాల్లో ప్రత్యేక శిబిరాల కార్యక్రమంలో భాగంగా అంటువ్యాధులు, ప్రభుత్వ పథకాలు, సాంఘిక దురాచారాలైన మద్యపానం, ధూమపానం, బాలకార్మిక వ్యవస్థ వంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కలబ్‌గూర్‌లో రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా, చింతల్‌పల్లిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.